క్లుప్తంగా

కార్పొరేషన్‌లో 'స్పందన'



అర్జీలు స్వీకరిస్తున్న కార్పొరేషన్ మేనేజర్ కర్రి సత్యనారాయణ

కాకినాడ: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ కే.రమేష్ ఆదేశాల మేరకు మేనేజర్ కర్రి సత్యనారాయణ ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించి ప్రజలు పలు సమస్యలను మేనేజర్‌కు వివరించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కోర్టు వివాదాలు, ఆర్థికపరమైన అంశాలు మినహా మిగిలిన అంశాలను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగరపాలక సంస్థ వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా వినతి పత్రాలు అందజేయవచ్చునన్నారు. ప్రతి ఒక్క వినతికి సకాలంలో పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్ల ఆన్‌లైన్

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్ చేసే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ ఉప కార్యదర్శి, రిటైర్డ్ ఉద్యోగి టీవీవీ ఎస్ఎన్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన రిటైర్డ్ ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికెట్ల కోసం సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, సీనియర్ సిటిజన్స్ సంఘ అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, డాక్టరు శిరీష, రేలంగి బాపిరాజు, ఎం.సుబ్బారావు, శ్రీరాములు, చక్రధర్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్రీడా పరికరాల వితరణ



క్రీడాపరికరాలను అందజేస్తున్న దృశ్యం

కాకినాడ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని జిల్లా పురోహితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పురోహితుల క్రికెట్ టోర్నీకి హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ క్రీడాపరికరాలను వితరణ చేశారు. సోమవారం పురోహితుల సంఘం ప్రతినిధులకు 140 బంతులను, ఇతర క్రీడాపరికరాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టోర్నీలకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్‌తో పాటు, మేనేజర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన

కాకినాడ సిటీ: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో తొలగించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం విధుల్లోకి తీసుకోవాలని సోమవారం ఆసుపత్రి గేట్ వద్ద ఆందోళన కొనసాగించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నాయకుడు పీఎఫ్ రాయుడు మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని జీతాలు తీసుకుంటూ సేవలు అందించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఒక్కసారిగా విధులకు దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులున్నా అడ్డుగోలుగా తొలగించారన్నారు. తక్షణమే తొలగించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చక్రవర్తి, ఇంద్రాణి, నిర్మల, కళావతి, బేబీరాణి, శ్రీనివాస్, బ్రహ్మం, చిన్ని, నాని, రమణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



పద్మాకల్యాణిని సత్కరిస్తున్న సత్కళావాహిని సభ్యులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవం, ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ విద్యార్థులు నృత్యరూపకాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకొన్నారు. తదుపరి శ్రీనివాస కోలాట భజన మండలి సభ్యులు భక్తిగీతాలు అలపించారు. అనంతరం నాట్యాచారిణి పద్మాకల్యాణిని సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఇడీ కృష్ణమాచార్యులు అన్నారు. ఈకార్యక్రమంలో కెవీ రావు, ప్రసన్నకుమారి, కూచి భాస్కరరామం, శారదాదేవి, శ్రీకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి



ప్రభుత్వం అందించిన లబ్ధిని గడపగడపకూ మన ప్రభుత్వంలో ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- జగన్‌తోనే ఆంధ్రప్రదేశ్ ప్రగతి
- గడపగడపకూలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కాకినాడ 12వ డివిజన్‌లో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ల ప్రభుత్వపాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిస్తూ దేశమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా ఎన్నో పాలనా సంస్కరణలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకునే బాధ్యత అన్నివర్గాల ప్రజలపై ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా స్వయంగా ఎమ్మెల్యేలను, పార్టీ కార్యకర్తలను ప్రతి గడపకూ పంపి సమస్యలు తెలుసుకునేలా సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇది ఎంతో మంచి కార్యక్రమం అని, దీని ద్వారా చేసిన అభివృద్ధిని వివరించడంతో పాటు స్వయంగా సమస్యలు తెలుసుకుని పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రజలు కూడా ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, కామాడి దశరథ, సంగాడి నందం, పలువురు మాజీ కార్పొరేటర్లు, అధికారులు ఆయన వెంట ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కరప మండలం కొంగోడులో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- గడపగడపకూలో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కరప మండలం కొంగోడు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులతో కలిసి ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వ పాలన సాగుతోందని, అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ నక్కా అప్పలస్వామి(బాబులు), ఉప సర్పంచ్ వనుం నారాయణరావు, మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సోదరుడిపై దాడి కేసులో బీజేపీ నేత అరెస్టు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామానికి చెందిన బీజేపీ నేత కాళ్ల ధనరాజు, అనుచరులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గత నెల 27న తనపై దాడి జరిగిందని నిందితులపై చర్యలు తీసుకోవాలని, తిమ్మాపురానికి చెందిన కాళ్ల విష్ణుమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు నేపథ్యంలో తిమ్మాపురం ఎస్సై నాగార్జునరాజు, సిబ్బంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. ఆస్తి తగాదాలు, కుటుంబ కక్షల నేపథ్యంలో సొంత అన్నయ్యపై దాడికి తన అనుచరులతో ధనరాజు ప్రోత్సహించారని ఎస్సై నాగార్జునరాజు తెలిపారు. ధనరాజు, దాడి చేసిన మరో ముగ్గురు, సహకరించిన ఇద్దరు మొత్తం ఆరుగురిని సోమవారం అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి



కరప హౌస్ ఆఫ్ ప్రేయర్‌లో పాస్టర్లను సన్మానిస్తున్న డాక్టర్ పితాని అన్నవరం

కరప: రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న సీఎం జగన్ మరో 30 ఏళ్లు సీఎంగా కొనసాగాలని దైవజనులు ప్రార్థించాలని రమ్య ఆస్పత్రి అధినేత డాక్టర్ పితాని అన్నవరం కోరారు. కరప హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అన్నవరం హాజరై మాట్లాడారు. అనంతరం పలువురు పాస్టర్లను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సేవకులకు దుస్తులు, నూతన సంవత్సర క్యాలెండర్లు పంపిణీ చేశారు. క్రిస్టియన్ మైనార్టీ ఆఫీసర్ షేక్ ఇమ్రాన్‌ఖాన్, జిల్లా జాయింట్ సెక్రటరీ ఐ.జాన్‌సూర్యప్రకాష్, సెక్రటరీ ఆర్.ప్రతాప్‌కుమార్, కె.అబ్రహం, గ్రేస్ విక్టర్, పి.సత్యప్రసాద్, జె.విక్టర్, పి.డేవిడ్‌రాజు, జె.పాల్ ప్రసాద్, ఆనంద్‌బాబు, స్టీఫెన్‌బాబు, పి.శామ్యూల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కరప జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు

కరప: కరప క్రికెట్ అసోసియేషన్(కేసీఏ) ఆధ్వర్యంలో ఈ ఏడాది యాళ్ల వెంకట్రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు దేవు మధువీరేష్ తెలిపారు. కరప జెడ్పీ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో సోమవారం సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను కరప జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్న మధువీరేష్‌ను ఆయన అభినందించారు. నక్కా భాస్కరమ్మ జ్ఞాపకార్థం నాకౌంట్ టోర్నమెంట్, దేవు సూరిబాబు జ్ఞాపకార్థం విజేత జట్టుకు గోల్డ్ కప్ రోలింగ్ ట్రోఫీని అందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు ఐదు మ్యాచ్‌లు జరగగా మారీ బాయ్స్, జెడ్.భావారం, గురజనాపల్లి-3, సీఏకే ఫ్రెండ్స్, గురజనాపల్లి-2 జట్లు తమ ప్రత్యర్థి జట్లపై విజయం సాధించాయి. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు(భీమన్న), సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు బొండా సూర్యారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నిర్వాహకులు నక్కా భీమ్, పోలిశెట్టి వాసు, శాకా శ్రీనివాస్, గరగ జెమ్మీ తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలి



పులిమేరులో హత్యకు గురైన దళిత యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా చేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: పెద్దాపురం మండలం పాలిమేరు గ్రామానికి చెందిన దళిత యువకుడు హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించి కేసును మూసి వేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ సంఘటనపై రీ పోస్టు మార్టం నిర్వహించి, విచారణ చేపట్టాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవార కాకినాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్ మాట్లాడుతూ పెద్దాపురం మండలం పాలిమేర గ్రామానికి చెందిన దళిత యువకుడు ఏనుగుపల్లి అప్పన్న నవంబర్ 29న పిఠాపురం మండలం విరవ గ్రామం పరిధిలోని పీహెచ్‌సీ కాలనీలో హత్యకు గురయ్యాడన్నారు. దీనిపై ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని వివరించారు. దీనిపై జిల్లా ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకొని, హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, రీ పోస్టుమార్టం నిర్వహించి, దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం కన్వీనర్ వడ్లమూరి మంగాదేవి, నాయకులు కె సతీష్, పప్పుదుర్గారమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో ప్రజాజీవనం అతలాకుతలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

కాకినాడ సిటీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎనిమిదేళ్ల పరిపాలన ప్రజా జీవనం అతలాకుతలం చేసిందని, ఫలితంగా కోట్లాది మంది ఉపాధి కోల్పోయారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి విమర్శించారు. సోమవారం కాకినాడ గాంధీ భవన్‌లో సీపీఐ కాకినాడ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ 24వ జాతీయ మహాసభలు విజయవాడలో అంగరంగవైభవంగా జరిగాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ మత ప్రాతిపదికన దేశంలో కులాలు మతాలు చిచ్చుపెట్టి రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని సత్యనారాయణమూర్తి అన్నారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన స్వేచ్ఛను నరేంద్రమోదీ హరిస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను చౌక ధరలకు బడా కార్పొరేటర్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. విద్యార్థులు, యువజనులందరం కలిసి పోరాటం చేసి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అంబానీ, అదానీలకు అమ్మేశారని దీనిని తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలు అణిచి వేయడానికి జీవో నంబర్ వన్ తీసుకొచ్చారని దీనిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ విశాఖ హక్కు పరిరక్షణ కోసం ఈనెల 23, 24, 25 తేదీల్లో రెవెన్యూ డివిజనల్ కేంద్రాల వద్ద జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ సీపీఐ ఆధ్వర్యంలో నిరాహారదీక్షలు చేయాలని మధు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు డేగ ప్రభాకరరావు, తోకల ప్రసాద్, జి లోవరత్నం, పి సత్యనారాయణ, పిఎస్ నారాయణ, టి అన్నవరం, శివకోటి రాజు, బొబ్బిలి శ్రీనివాసరావు, కె జ్యోతిరాజు, తుపాకల లక్ష్మీనారాయణ, పప్పు ఆదినారాయణ, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు



రోటరీగవర్నర్‌గా ఎన్నికైన కల్యాణచక్రవర్తి, ఆండాళ్ దంపతులను సత్కరిస్తున్న రోటరీక్లబ్ కాకినాడ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకొంటున్నట్టు రోటరీ 3020 డిస్ట్రిక్ గవర్నర్‌గా ఎన్నికైన కల్యాణచక్రవర్తి తెలిపారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో సోమవారం రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో 2025- 26 సంవత్సరానికి గవర్నర్‌గా ఎన్నికైన కల్యాణచక్రవర్తిని రోటరీ క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ మాజీ గవర్నర్లు కేవీఎస్ ఆంజనేయమూర్తి, టిక్కు, డాక్టర్ పూషా, ఎస్‌వీఎస్‌రావు మాట్లాడుతూ చక్కటి నాయకత్వ లక్షణాలు కలిగిన కల్యాణ్ చక్రవర్తి తన గవర్నర్ షిప్‌లో రోటరీ క్లబ్ కీర్తి ప్రతిష్టలను మరెంత పెంచేలా పనిచేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఫౌండేషన్ నిధులతో రోటరీ డిస్ట్రిక్ పరిధిలో శాశ్వత ప్రాజెక్టులు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం రోటరీక్లబ్ కాకినాడ అధ్యక్షురాలు సురభిశారద ఆధ్వర్యంలో రోటరీ గవర్నర్‌గా ఎన్నికైన కల్యాణచక్రవర్తి, ఆండాళ్ దంపతులను సత్కరించి జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కృష్ణంరాజు, ఎస్‌కె అహ్మద్, చోడవరపు మూర్తి, తడాల వరప్రసాద్, బాబీ , పవన్, కల్యాణి రమేష్, భాస్కర్‌రెడ్డి, రిక్కీ గూటం, పోలిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

'చారిటీస్' కోసం ట్రస్టుబోర్డు అందుబాటులో ఉంది

- వేరెవ్వరి ప్రమేయం అవసరం లేదు
- ట్రస్టు బోర్డు చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్

కాకినాడ: కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ ఆస్తులతో దాత దివంగత మల్లాడి సత్యలింగ నాయకర్ వంశ పారంపర్య కుటుంబీకులకు తప్ప మరే ఇతర రాజకీయ నాయకులు, ఇతర వ్యక్తులకు ఎటువంటి సంబంధం లేదని ఎంఎస్ఎన్ చారిటీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్ స్పష్టం చేశారు. 1971 నుంచి ఎంఎస్ఎన్ చారిటీస్ సంస్థ దేవదాయ ధర్మాదాయశాఖ నిర్వహణలో నడుస్తోందని స్పష్టం చేశారు. చారిటీస్ ఆస్తుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నట్టుగా కొంతమంది ప్రచారం చేసుకుంటున్నారని, వాస్తవానికి చారిటీస్‌కు సంబంధించిన ఏ అంశమైనా తమ కుటుంబానికి మాత్రమే సంబంధమని పేర్కొన్నారు. ఆస్తులపై ఎటువంటి సమస్య, వివాదం వచ్చినా వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం నియమించిన ట్రస్టు బోర్డు కూడా ఉందన్నారు. ముఖ్యంగా కాకినాడ సిటీలో ఉన్న ఎంఎస్ఎన్ చారిటీస్ విషయంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తమకు అన్ని విధాలా అండగా ఉండి సహకరిస్తున్నారన్నారు. చారిటీస్‌లోని విద్యాసంస్థల కోసం ఆయన రూ.50 లక్షల నిధులు కూడా మంజూరు చేయించారని ఆయన చెప్పారు. తమ సంస్థ విషయంలో బయటి వ్యక్తులు చేసుకుంటున్న ప్రచారానికి తమకు సంబంధం లేదన్నారు.

'సంకల్ప' బలానికి నాలుగేళ్లు

- కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి
- పాల్గొన్న మాజీ మేయర్, నాయకులు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: మహోన్నత లక్ష్యంతో చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కాకినాడ 12వ డివిజన్‌లో పార్టీ శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర చేపట్టి అన్ని వర్గాల ప్రజల్లో ఒక భరోసాగా నిలిచారన్నారు. జగన్ సీఎం అయితే తమ కష్టాలు, సమస్యలు తీరుతాయనే ఆకాంక్షతో ప్రజలు సీఎంగా జగన్‌కు పట్టం కట్టారన్నారు. నాడు పాదయాత్ర సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ తండ్రికి మించిన తనయుడిగా సీఎం జగన్ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టారన్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల కోసం నవరత్న పథకాలను రూపొందించి పటిష్టంగా అమలు చేయడం ద్వారా ప్రజాసంకల్ప పాదయాత్ర లక్ష్యాన్ని చేరుకున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని ప్రజలు మళ్లీమళ్లీ ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లమిల్లి సుజాత, కర్రి శైలజ, దశరథ, నందం, స్థానిక నాయకులు మట్టపర్తి రఘురాం, జితేంద్రసింగ్, పరశురాం, పెదబాబు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి పోటీలు



విజేతకు వాషింగ్ మెషీన్ అందజేస్తున్న కురసాల సత్యనారాయణ, సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, సీఐ శ్రీనివాస్

కాకినాడ రూరల్: స్థానిక తిమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలు సందడి చేశాయి. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సోమవారం సాయంత్రం అట్టహాసంగా జరిగాయి. ముగ్గులు, వాలీబాల్ వంటి పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు సాయంత్రం బహుమతి ప్రదానం చేయగా ముఖ్య అతిథిగా నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు కురసాల సత్యనారాయణ, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై నాగార్జునరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలల్లో విజేతలకు వాషింగ్ మెషీన్, గ్రైండర్, మిక్సీ, వాలీబాల్ పోటీల విజేత, రన్నర్ జట్లకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కురసాల సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదం కాదని, సంప్రదాయ క్రీడలన్నారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ మాట్లాడుతూ తిమ్మాపురంలో పండగ వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ముందుగానే సంక్రాంతి సంబరాలను నిర్వహించామన్నారు. సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్రాంతి ముందు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అన్ని చోట్ల సంప్రదాయ సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కాకినాడ సిటీ: 108 అంబులెన్స్ సిబ్బందికి ప్రతి నెల ఐదో తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, యాజమాన్యం అక్రమంగా తొలగించిన 72 మందిని బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ఉద్యోగులు నిరసన శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ హామీ మేరకు సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా 108 సిబ్బందికి సమాన పనికి సమానవేతనం అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు 108లో ఉద్యోగులుగా పని చేస్తున్న ఈఎంటీ, పైలెట్‌లను వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని, కాలం చెల్లిన వాహనాల స్థానంలో నూతన 108 వాహనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిబ్బందికి 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ప్రతి 108 లొకేషన్‌లో సిబ్బంది కోసం శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు.

షాపుల లీజు వేలం ఖరారు

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని కోకనాడ అన్నదాన సమాజానికి చెందిన ఖాళీ స్థలాల లీజువేలం సోమవారం జగన్నాథపురం విష్ణాలయం వీధిలో నిర్వహించారు. 186 గజాల ఖాళీస్థలానికి నిర్వహించి వేలం రూ.4300 హెచ్చుపాటదారుకు ఖరారు చేశారు. 337 గజాల ఖాళీస్థలానికి పాట దారులు పోటీపడి మరీ రూ.12,700కు పాడుకున్నారు. దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో లీజు వేలం పాట నిర్వహించారు. స్థానిక పూసర్లవారి వీధిలో ఉన్న 203 చదరపు గజాల ఖాళీస్థలానికి, అన్నదాన సమాజం ఉత్తరం వైపు ఉన్న 445 గజాల ఖాళీస్థలానికి అనుకున్న విధంగా లీజు వేలం రాకపోవడం ఈ రెండింటిని వాయిదా వేశారు. త్వరలో మళ్లీ లీజు వేలం పాట నిర్వహిస్తామని ఆర్‌జేసీ సురేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, దేవదాయశాఖ తనిఖీదారు ఫణి కుమార్, అన్నదాన సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావు పలు దేవాలయాల ఈఓలు పాల్గొన్నారు.

వీఓఏల తొలగింపునకు తీర్మానం

కాకినాడ రూరల్: మండలంలోని పలు డ్వాక్రా సంఘాల రుణాల అవకతవకలకు పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో డీఆర్‌డీఏ పీడీ శ్రీ రమణి ఆదేశాల మేరకు పది మంది వీఓఏలను తొలగించేందుకు మండల మహిళా సమాఖ్య సంఘ సభ్యులు సోమవారం తీర్మానించారు. రమణయ్యపేటలోని మండల సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో సభ్యులు డీఆర్‌డీఏ పీడీ ఇచ్చిన తీర్మానంపై చర్చించి, తీర్మానం చేశారు. ఒక సంఘం సభ్యులను రెండు సంఘాల్లో చూపి రుణాలు మంజూరు చేయడం వంటి ఆరోపణల నేపథ్యంలో గతేడాది డిసెంబర్‌లో డీఆర్‌డీఏ పీడీ ఆదేశాల మేరకు విచారణ నిర్వహించి, అప్పట్లో సీసీని తొలగించారు. మిగిలిన 16మంది వీఓఏల ప్రమేయం ఉన్నట్టు నిర్ధారించి వీరిలో పదిమందిని తొలగించేందుకు తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నారు.

ఫాతిమా షేక్ 192వ జయంతి వేడుకలు

కాకినాడ సిటీ: మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయ్ పూలే దంపతులకు మొదటి సహచరిగా ఉంటూ వారితో అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న మొదటి ముస్లిం ఉపాధ్యాయిని ఫాతిమా షేక్ 192వ జయంతి వేడుకలను కాకినాడలో సోమవారం ప్రజల సంఘాల ఐక్యవేదిక నాయకులు నిర్వహించారు. 19వ శతాబ్దంలోనే విద్యను ఒక ఉద్యమంగా వాడవాడలా స్త్రీ, పురుషులకు అందించేందుకు కృషి చేస్తున్న జ్యోతిరావు పూలే, సావిత్రిబాయ్‌ఫూలేలను అప్పటి పీష్వాలు, సామాజిక బహిష్కరణ వేటు వేయగా మొదటగా వారికి ఆశ్రయం కల్పించింది ఫాతిమా షేక్ అని నాయకులు వివరించారు. పూలే దంపతుల ఆలోచనా విధానాన్ని స్వాగతించిన మొదటి పాఠశాలగా ఆమె హవెలిని బహూకరించారన్నారు. ఈ జయంతి వేడుకల్లో ముస్లిం పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ హసన్ షరీఫ్, ఐక్యవేదిక నాయకులు పప్పు దుర్గారమేష్, అయితాబత్తుల రామేశ్వరరావు, పిట్టా వరప్రసాద్, సబ్బతి ఫణీశ్వరరావు, హుస్సేన్, హలీం, వెంకటేశ్వర్లు తది తరులు పాల్గొన్నారు.